APTEL/2015/65279

Postal Reg.No. MPM/L22/VNEWS/19-21

V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

ఏపీలో కొత్తగా 60 పాజిటివ్ కేసులు

(విన్యూస్, అమరావతి) : ఆంధ్రప్రదేశ్‌లో కరోనా విజృంభణ కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో 7,902 మంది నమూనాలు పరీక్షించగా 60 పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్య, ఆరోగ్య శాఖ తాజా బులిటెన్‌లో వెల్లడించింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 1,463కి చేరింది. కాగా ఇప్పటి వరకూ 403 మంది కరోనా నుంచి కోలుకుని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. 33 మంది మరణించారు. ప్రస్తుతం 1027 మంది వివిధ కొవిడ్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కరోనాతో ఇవాళ నెల్లూరు జిల్లాలో ఒకరు, కర్నూలు జిల్లాలో ఒకరు మృతి చెందారు. ఈరోజు నమోదైన కేసుల్లో అత్యధికంగా 25 కర్నూలు జిల్లాలో ఉన్నాయి. దీంతో జిల్లా వ్యాప్తగా నమోదైన కేసుల సంఖ్య 411కు చేరింది.

సంపుటి : 6 సంచిక : 296 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 02-05-2020 శనివారం పేజీలు :4 వెల : రూ.3/-

కోవిడ్-19 నివారణ చర్యలపై సీఎం జగన్ సమీక్ష

(విన్యూస్, అమరావతి) : లాక్‌డౌన్ సడలింపుల నేపథ్యంలో విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశాలు న్నందున అనుసరించాల్సిన విధానంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనిపై పూర్తిస్థాయిలో కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. క్వారంటైన్‌లో అందించాల్సిన సదుపాయాలు, వసతిపై ఇప్పటి నుంచే దృష్టిపెట్టాలని, వివిధ రాష్ట్రాలనుంచి వస్తున్నవారి విషయంలో కూడా సరైన విధానాన్ని అనుసరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కరోనా వైరస్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవిడ్-19 నివారణా చర్యలపై ఉన్నతాధికారులతో చర్చించారు. అలాగే ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ప్రజలను స్క్రీనింగ్ చేయడం, అవసరమైన వారిని క్వారంటైన్‌కు తరలించడం తదితర అంశాలపై ఆన్నతాధికారులతో ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చ జరిపారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు, సీఎస్ నీలం సాహ్ని, డీజీపీ గౌతం సవాంగ్, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ మాట్లాడుతూ.. క్వారంటైన్ కేంద్రాల్లో సదుపాయాలు, పారిశుద్ధ్యం, భోజనం తదితర అంశాలపై క్రమం తప్పకుండా సమీక్ష చేయాలని ఆదేశించారు. వీటిపై ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని సీనియర్ ఐఎఎస్ అధికారి కృష్ణబాబుకు సూచించారు. సదుపాయాలు, పారిశుద్ధ్యం, భోజనం, మందులు అందుతున్నాయా లేదా అన్నదానిపై క్వారంటైన్లో ఉన్నవారి నుంచి ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సుకుంటున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. విదేశాలనుంచి వచ్చే వారికి దాదాపుగా నాన్ కోవిడ్ సర్టిఫికెట్ ఉంటుందని, వారికి హోం క్వారంటైన్ విధిస్తామని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు తెలిపారు. అలాగే గుజరాత్ నుంచి విశాఖపట్నం, విజయనగరం నుంచి వచ్చిన మత్స్యకారులకు పూల్ శాంపిల్స్ చేసి ఫలితాల ఆధారంగా ఇళ్లకు పంపిస్తామని అన్నారు. ఇక శ్రీకాకుళం చేరుకునేవారికి కూడా సెంటర్లు ఏర్పాటుచేసి, పరీక్షలు చేసి ఫలితాల ఆధారంగా ఇళ్లకు పంపిస్తామని తెలిపారు.

కోవిడ్-19 మరణాలు తగ్గించేందుకు వ్యూహం

రాష్ట్రంలో ఇప్పటివరకూ 1,00,997 కోవిడ్-19 పరీక్షలు నిర్వహించామని, నిన్న ఒక్కరోజే 7902 పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ప్రతి మిలియన్‌కు 1919 చొప్పున పరీక్షలు నిర్వహిస్తూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 235 క్లస్టర్లు, 79 వెరీ యాక్టివ్ క్లస్టర్లు, 68 యాక్టివ్ క్లస్టర్లు, 53 డార్మంట్ క్లస్టర్లు, 35 క్లస్టర్లలో 28 రోజుల నుంచి కేసులు లేవని అధికారులు వెల్లడించారు. కుటుంబ సర్వే ద్వారా గుర్తించిన దాదాపు 32,792 మందిలో 17,585 మందికి పరీక్షలు చేశామని, మిగిలిన వారికి 2-3 రోజుల్లో పరీక్షలు పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. వీరిలో 4వేల మంది హైరిస్క్ ఉన్నవారిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. అయితే వీరికి పరీక్షలు చేసి... లక్షణాలు ఉంటే.. ముందస్తు వైద్యం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు.

కరోనా కారణంగా మరణాలు సంభవించకుండా చూడాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్న అధికారులు సీఎంకు తెలిపారు. జిల్లాల వారీగా ప్రత్యేక నంబర్లు కేటాయిస్తున్నామని, హైరిస్క్ ఉన్నవారు శ్వాసకోసతో సంబంధిత సమస్యలతోగాని, ఇతరత్రా వ్యాధులతో బాధపడుతున్నవారు ఏమాత్రం ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే ఈ నంబర్లకు కాల్ చేస్తే.. వెంటనే వైద్యం అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్న అధికారులు తెలిపారు. టెలిమెడిసన్, విలేజ్ క్లినిక్, పీహెచ్‌సీల మధ్య సరైన సమన్వయం ఉండాలన్న సీఎం జగన్ అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు అత్యంత చేరువగా ఉన్న వైద్య వ్యవస్థగా తీర్చిదిద్దాలని, టెలీమెడిసిన్‌ద్వారా ప్రిస్క్రిప్షన్ పొందడం, అక్కడనుంచి నేరుగా విలేజ్ క్లినిక్ ద్వారా మందులు సరఫరాచేయడం జరగాలన్నారు.

వ్యవసాయం, అనుబంధ రంగాలు

ధాన్యం సేకరణ అన్ని జిల్లాల్లో చురుగ్గా సాగుతోందని అధికారులు ముఖ్యమంత్రి జగన్‌కు తెలిపారు. ఒక్క కృష్ణా జిల్లాలో ధాన్యం సేకరిస్తున్న సమయంలో బస్తాకు కొంత ధాన్యాన్ని మినహాయిస్తున్నారంటూ రైతులనుంచి వచ్చిన ఫిర్యాదులపై సమావేశంలో చర్చ జరగగా.. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ, సెక్రటరీ, డీజీపీ లాంటి వ్యక్తులంతా ఇదే కృష్ణా జిల్లాలో ఉన్నాసరే.. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం సరికాదన్నారు. పంటలను రోడ్డుమీద వేసిన ఘటనలు గత ప్రభుత్వ హయాంలో రోజూ కనిపించేవని, అలాంటి ఘటనలు ఈ ప్రభుత్వ హయాంలో కనిపించడానికి వీల్లేదని చెప్పిన ముఖ్యమంత్రి చీనీ, అరటి, టమోటో, మామిడి ప్రాససింగ్ ప్లాంట్లపై దృష్టి పెట్టాలని, వచ్చే ఏడాది.. ఈ పంటల విషయంలో మళ్లీ మార్కెటింగ్ సమస్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వివిధ స్థాయిలో వ్యవసాయ సలహామండళ్లు

"రైతు భరోసా కేంద్రాలకు నెట్, విద్యుత్ సహా అన్ని సౌకర్యాలను వెంటనే కల్పించాలి. ఏ ఊరిలో ఏ పంట వేయాలన్న విషయాన్ని ఆర్‌బీకేల ద్వారా అవగాహన కలిగించాలి. ఏ పంట వేస్తే మార్కెట్‌లో మంచి ధరకు అమ్ముడు పోయే అవకాశాలున్నాయన్నదానిపై రైతులకు అవగాహన కలిగించాలి. ప్రతి ఊర్లో కూడా ఏయే పంటలు ఎంతమేర పండించాలన్నదానిపై రైతులతో కలిసి కూర్చుని నిర్ణయించుకోవాలి. జాతీయ అంతర్జాతీయంగా వివరాలను విశ్లేషించి.. ఆమేరకు కార్యాచరణ ఉండాలి. రాష్ట్రస్థాయి వ్యవసాయ అడ్వైజరీ బోర్డులు, జిల్లా అడ్వైజరీ బోర్డులు, మండల అడ్వైజరీ బోర్డులు ఏర్పాటుకు ఆదేశం. ఏయే పంటలు, ఎక్కడ ఎంతమేర సాగు చేయాలన్నదానిపై ఈ-బోర్డులు సలహాలు ఇవ్వాలి. ఈ-బోర్డుల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలి".

"రాష్ట్రస్థాయి అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డులు, జిల్లా స్థాయి బోర్డులకు, అక్కడ నుంచి మండల స్థాయి అడ్వైజరీ బోర్డులకు ఏయే పంటలు, ఎక్కడ వేయాలన్న దానిపై రైతులకు సూచనలు చేయాలి. పంటలు వేసేటప్పుడే ధర ప్రకటించి, రైతుకు ఆ ధర దక్కేలా చూడాలి. దీనివల్ల రైతుల్లో విశ్వాసం కలుగుతోంది. పంటలను ఇ-క్రాపింగ్ చేయడం, రైతు భరోసాకేంద్రాలను వినియోగించి వాటిని కొనుగోలు చేయడం.. ఈ ప్రక్రియలన్నీ.. వ్యవస్థీకృతంగా సాగిపోవాలి. గత ప్రభుత్వం హయాంలో ఏరోజూ వ్యవసాయం మీద దృష్టిపెట్టలేదు. మన ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం, అనుబంధ రంగాలు, వాటి పరిస్థితుల మెరుగుదల కోసం ప్రత్యేకంగా దృష్టిపెట్టి విస్తృతంగా సమీక్షించుకుంటున్నాం. ఇంతచేస్తున్నప్పుడు కచ్చితంగా ఫలితాలు రావాలి" అని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు.

మే 17 వరకు లాక్‌డౌన్ పొడిగింపు: కేంద్రం



(దిల్లీ) : దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మరోసారి లాక్‌డౌన్ పొడిగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు మరో రెండోవారాలపాటు లాక్‌డౌన్ పొడిగిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొవిడ్-19పై విస్తృత సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మే 4 నుంచి 17 వరకు లాక్‌డౌన్ కొనసాగనుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

లాక్‌డౌన్ పొడిగించడం ఇది మూడో సారి. తొలిసారి 21 రోజుల లాక్‌డౌన్‌ను మార్చి 24న ప్రధాని మోదీ ప్రకటించారు. అది పూర్తి కాక ముందే మరోసారి మే 3 వరకు లాక్‌డౌన్‌ను పొడిగించారు. తాజాగా మరో రెండు వారాల పాటు లాక్‌డౌన్ పొడిగిస్తూ హోంశాఖ ఉత్తర్వులు వెలువరించింది. మూడో విడత లాక్‌డౌన్‌లో గ్రీన్, ఆరెంజ్ జోన్లలో ఉన్న జిల్లాలకు కొన్ని మినహాయింపులు ఇస్తూ నూతన మార్గదర్శకాలను హోంశాఖ జారీ చేసింది. మరోవైపు ప్రధాని మోదీ రేపు ఉదయం 10 గంటలకు జాతిని ఉద్దేశించి మాట్లాడనున్నారు.

కూలీల తరలింపునకు ప్రత్యేక రైళ్లు

స్వస్థలాలకు తరలించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

(దిల్లీ) : లాక్‌డౌన్ కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన కూలీలు, విద్యార్థులు, యాత్రికులు, ఇతరులను రైళ్లలో తరలించేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. వారిని తమ తమ స్వస్థలాలకు పంపించేందుకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. కూలీలు తరలింపునకు రైలు సేవలు వినియోగించుకునేలా మార్గదర్శకాలను సవరిస్తూ హోంశాఖ ఉత్తర్వులు వెలువరించింది. ప్రత్యేక రైళ్లను రైల్వేమంత్రిత్వ శాఖ నడుపుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

దీనికి సంబంధించి రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలతో సమన్వయం చేసుకునేందుకు ఓ నోడల్ అధికారిని రైల్వే శాఖ నియమిస్తుందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం మాట్లాడుకుని, రైల్వే శాఖతో సంప్రదించి ఈ రైళ్లు ఏర్పాటు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. శ్రామిక ప్రత్యేక రైళ్లు పేరిట వీటిని ఇవాల్టి నుంచి నడపనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రైలు ఎక్కించేటప్పుడు, గమ్యస్థానం చేరుకున్న తరువాత అక్కడి ప్రభుత్వ అధికారులు స్వయంగా వచ్చి తీసుకువెళ్లేలా చూడాలని ఆదేశాల్లో పేర్కొంది. టికెట్ల విక్రయం, రైళ్లు, రైల్వే స్టేషన్, ప్లాట్‌ఫాంపై భౌతిక దూరానికి సంబంధించి మార్గదర్శకాలను రైల్వేశాఖ జారీ చేయనుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు అన్ని జోనల్ మేనేజర్లకు రైల్వే శాఖ ప్రత్యేక ఆదేశాలు పంపింది.

ఇప్పటికే తెలంగాణ నుంచి ఝార?ండ్‌కు 1200 మంది వలస కూలీలతో ప్రత్యేక రైలు ఇవాళ ఉదయం బయలుదేరిన సంగతి తెలిసిందే. అలాగే ట్రక్కుల రవాణాకు అనుమతివ్వాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశించింది. సరకు రవాణాకు ఇబ్బందుల లేకుండా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని ఆ శాఖ సంయుక్త కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాత్సవ తెలిపారు. వలస కూలీలు, విద్యార్థులు స్వస్థలాలకు వెళ్లేందుకు అనుమతివ్వాలని కోరారు. ఈ మేరకు దిల్లీలో సంయుక్త మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

ప్రధాని మోదీ కీలక సమావేశం

(దిల్లీ) : కరోనా వైరస్ నివారణ, దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి హోంమంత్రి అమిత్ షా, రైల్వే, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా హాజరయ్యారు. లాక్‌డౌన్ కొనసాగింపు, తదుపరి కార్యాచరణపై ప్రధాని వీరితో చర్చించినట్టు సమాచారం.

కేంద్ర ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ గడువు ఈనెల 3వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రధాని దృష్టి సారించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. లాక్‌డౌన్ కొనసాగించాలని కొందరు, ఎత్తివేయాలని, ఆంక్షలు సడలించాలని మరికొందరు సీఎంలు సూచించారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రధాని.. తదుపరి కార్యాచరణపై కసరత్తు చేస్తున్నారు.

కేంద్ర హోంశాఖ తాజాగా గుర్తించిన రెడ్‌జోన్లు, ఆరెంజ్ జోన్లు, గ్రీన్ జోన్ల వివరాలను వెల్లడించింది. దీన్ని బట్టి రెడ్ జోన్లలో లాక్‌డౌన్ కొనసాగించేందుకే ప్రధాని మొగ్గు చూపుతారన్న ప్రచారం జరుగుతోంది. తాజా గణాంకాల ప్రకారం.. దేశ వ్యాప్తంగా 130 జిల్లాలు రెడ్ జోన్‌లో, 284 జిల్లాలు ఆరెంజ్ జోన్‌లో, 319 జిల్లాలు గ్రీన్ జోన్‌లో ఉన్నాయని కేంద్ర హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. కరోనా వైరస్ తీవ్రతను బట్టి తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి ప్రీతీ సదన్ లేఖ రాశారు. మంత్రులు, అధికారులతో భేటీ అనంతరం ఈరోజు లేదా రేపు ప్రధాని మోదీ ప్రకటన చేసే అవకాశముంది. 3వ తేదీతో లాక్‌డౌన్ గడువు ముగియనుండటంతో లాక్‌డౌన్ కొనసాగిస్తారా? ఎత్తివేస్తారా? అనేదానిపై దేశ ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రధాని ప్రకటన తర్వాతే లాక్‌డౌన్ ఉత్కంఠకు తెరపడనుంది.

21 లక్షల RT-PCR కిట్లకు ఆర్డర్: కేంద్రం

(దిల్లీ) : దేశంలో గడిచిన 24 గంటల్లో కొత్తగా 1993 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో దేశంలో మొత్తం కేసుల సంఖ్య 35,043కు చేరిందని వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. మొత్తం కేసుల్లో 25.37 శాతం మంది అంటే 8,888 మంది ఇప్పటి వరకు కోలుకుని డిశ్చార్జీ అయ్యారని ఆ శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. ఒక్కరోజులో 564 మంది కోలుకున్నారని సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించారు.

దేశంలో 75వేల వెంటిలేటర్లు అవసరమని, ప్రస్తుతం 19,398 అందుబాటులో ఉన్నాయని సాధికార కమిటీ-3 ఛైర్మన్ పీడీ వాఘేలా తెలిపారు. 60,884 వెంటిలేటర్లు ఆర్డర్ చేశామని చెప్పారు. 2.22 కోట్ల పీపీఈ కిట్లు, 2.49 కోట్ల ఎన్-95/ఎన్-99 మాస్కులు ఆర్డర్ చేసినట్లు వివరించారు. 4 లక్షల ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, ప్రస్తుత అవసరాలకు అవి సరిపోతాయని తెలిపారు. మొత్తం 35 లక్షల ఆర్‌టీ-పీసీఆర్ కిట్లు అవసరం కాగా.. 21.35 లక్షల కిట్లను భారత వైద్యపరిశోధన మండలి ఆర్డర్ చేసిందని చెప్పారు. 13.75 లక్షల కిట్లు వచ్చాయని వాఘేలా వివరించారు. హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రల ఉత్పత్తిని నెలకు 12.23 కోట్ల నుంచి 30 కోట్లకు పెంచినట్లు చెప్పారు.

తగ్గిన వంటగ్యాస్ ధర..

(విన్యూస్, అమరావతి) : అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పతనమైన వేళ సబ్సిడీయేతర ఎల్పీజీ సిలిండర్ ధర రికార్డు స్థాయిలో రూ. 162.50 మేర తగ్గింది. కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు విధించిన లాక్‌డౌన్‌తో చమురు ధరలు పడిపోగా.. వరుసగా మూడో నెలలో సబ్సిడీయేతర వంటగ్యాస్ ధరలు తగ్గాయి. ప్రస్తుతం 14.2 కిలోల సిలిండర్ ధర దిల్లీలో రూ. 581.50కు తగ్గింది. గత ఏడాది జనవరిలో సిలిండర్ ధర రూ. 150.50 తగ్గగా.. ఇప్పుడు రూ.162.50 మేర తగ్గింది. గత మూడు నెలల్లో సబ్సిడీ లేని వంటగ్యాస్ సిలిండర్‌కు రూ. 277 వరకు తగ్గిందని ఎల్పీజీ సంస్థలు తెలిపాయి.

భారత్‌లో 35వేల కేసులు, 1147 మరణాలు

(దిల్లీ) : భారత్‌లో కరోనా మహమ్మారి తీవ్రత పెరుగుతూనే ఉంది. గడచిన 24గంటల్లో దేశవ్యాప్తంగా అత్యధికంగా కొత్తగా 1993కేసులు నిర్ధారణ కావడంతోపాటు 73మరణాలు సంభవించాయి. దీంతో దేశంలో కరోనా వైరస్ సోకి మరణించిన వారిసంఖ్య 1147కి చేరగా మొత్తం బాధితుల సంఖ్య 35,043కు చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వశాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో 8889మంది కోలుకోగా ప్రస్తుతం మరో 25,007 మంది చికిత్స పొందుతున్నారు. దేశంలో వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి శాతం 25.36గా ఉంది. గత రెండువారాలుగా కోలుకుంటున్నవారి సంఖ్య భారీగా పెరిగిందని ప్రభుత్వం వెల్లడించింది.

మహారాష్ట్రలోనే 10వేల కేసులు, 459మరణాలు..

మహారాష్ట్రలో కరోనా వైరస్ విజృంభణ కలవరపెడుతోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం కరోనా సోకిన వారిసంఖ్య 10498చేరగా 459మంది మృత్యువాతపడ్డారు. ఇక దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో కరోనా వైరస్ విలయతాండవం చేస్తోంది. గుజరాత్‌లో మొత్తం కేసుల సంఖ్య 4395కి చేరగా ఇప్పటివరకు 214మంది ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్‌లోనూ కొవిడ్ ఉధృతి కొనసాగుతోంది. రాష్ట్రంలో మొత్తం 2660 పాజిటివ్ కేసులు నిర్ధారణ కాగా 137మంది మరణించారు. దేశ రాజధాని దిల్లీలో ఇప్పటివరకు 3515 మందికి కరోనా సోకగా 59మంది మరణించారు.

S. No.	Name of State / UT	Total Confirmed cases (Including 111 foreign Nationals)	Cured/Discharged/ Migrated	Death
1	Andaman and Nicobar Islands	33	16	0
2	Andhra Pradesh	1403	321	31
3	Arunachal Pradesh	1	1	0
4	Assam	42	29	1
5	Bihar	418	82	2
6	Chandigarh	56	17	0
7	Chhattisgarh	40	36	0
8	Delhi	3515	1094	59
9	Goa	7	7	0
10	Gujarat	4395	613	214
11	Haryana	313	209	3
12	Himachal Pradesh	40	28	1
13	Jammu and Kashmir	614	216	8
14	Jharkhand	109	20	3
15	Karnataka	565	229	21
16	Kerala	497	383	4
17	Ladakh	22	16	0
18	Madhya Pradesh	2660	482	137
19	Maharashtra	10498	1773	459
20	Manipur	2	2	0
21	Meghalaya	12	0	1
22	Mizoram	1	0	0
23	Odisha	142	39	1
24	Puducherry	8	5	0
25	Punjab	357	90	19
26	Rajasthan	2584	836	58
27	Tamil Nadu	2323	1258	27
28	Telengana	1038	397	26
29	Tripura	2	2	0
30	Uttarakhand	57	36	0
31	Uttar Pradesh	2203	513	39
32	West Bengal	795	139	33
	Total number of confirmed cases in India	35043*	8889	1147

ఆంధ్రప్రదేశ్‌లో వైరస్ తీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో నిన్న ఒక్కరోజే 71పాజిటివ్ కేసులు నిర్ధారణ కావడంతో మొత్తం బాధితుల సంఖ్య 1403కి చేరింది. వీరిలో ఇప్పటివరకు 31 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఇక తెలంగాణలో నిన్న కొత్తగా 22కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1038కి చేరగా 28మంది మరణించినట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది.

కన్నా వ్యాఖ్యలను నిరూపిస్తే నేడే రాజీనామా: మంత్రి బుగ్గన

(విన్యూస్, విజయవాడ) : కరోనా నిర్ధారణ పరీక్షల కిట్ల కొనుగోలు కంపెనీలో తాను డైరెక్టర్‌ను కాదని ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. కిట్ల కొనుగోలు అంశంలో బీజేపీ నేత కన్నా లక్ష్మీ నారాయణ ఆరోపణలపై శుక్రవారం ఆయన స్పందించారు. తాను సదరు కంపెనీలో డైరెక్టర్‌ను అని నిరూపిస్తే రేపు ఉదయం 9 గంటలకే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. కాగా కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా దక్షిణ కొరియా నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఒక్కో కిట్‌కు రూ. 730 చొప్పున వెచ్చించి తొలుత లక్ష కిట్లను దిగుమతి

చేసుకున్న సర్కారు.. రెండు లక్షల కిట్ల కొనుగోలుకు ఇచ్చిన పర్చేజ్ ఆర్డర్‌లో ప్రత్యేకమైన క్లాజ్‌ను పెట్టింది. దేశంలో ఎవరకి తక్కువ ధరకి అమ్మితే అదే ధరను చెల్లిస్తామని షరతు కూడా విధించింది.

ఈ క్రమంలో కన్నా లక్ష్మీ నారాయణ సహా పలువురు టీడీపీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అయితే ర్యాపిడ్ కిట్ల కొనుగోలు డాక్యుమెంట్లను ప్రభుత్వం విడుదల చేయడంతో వీరి తప్పుడు ప్రచారం బట్టబయలైంది. ఇదిలా ఉండగా.. కరోనా నిర్ధారణ పరీక్షల్లో ఇప్పటికే దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ మరో ఘనత సొంతం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షకుపైగా టెస్టులు నిర్వహించినట్టు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ శుక్రవారం వెల్లడించింది.

V న్యూస్

చైనా నష్టం భారత్‌కు లాభించేనా?

విశ్వవ్యాప్తంగా కొవిడ్ కేసుల ప్రజ్వలనానికి పురిటిగడ్డగా పరువుమాసిన చైనాతో వాణిజ్య బాంధవ్యం పట్ల అమెరికా సహా ఎన్నో దేశాల విముఖత- భారత్‌కు సానుకూలాంశం కానుందా? కొన్నేళ్లుగా అంతర్జాతీయ సరఫరా గొలుసుపై చైనా తిరుగులేని ఆధిపత్యానికి ఇక గండి పడనుందా? ఇవిప్పుడు ప్రపంచ దేశాల్లో ఎనలేని ఆసక్తి రేకెత్తిస్తున్న ప్రశ్నలు. చైనాకు అనివార్యంగా వాటిల్లనున్న నష్టం ఇండియాకు లబ్ధి చేకూర్చనుందన్న వాదనలకు పోనుపోను గట్టి వత్తాసు వ్యక్తమవుతోంది! వాస్తవానికి అమెరికా, చైనాల మధ్య పెచ్చరిల్లిన వాణిజ్య యుద్ధం గత జులైలో అనూహ్య ఘటనలకు తెరతీసింది. అప్పట్లో అమెరికా కంప్యూటర్ దిగ్గజాలు హెచ్‌పీ, డెల్‌తోపాటు పలు విదేశీ సంస్థలు చైనాలో వాణిజ్య ఉత్పత్తి కార్యకలాపాలను తెగ్గోశాయి. రీకో, సోనీ వంటి జపాన్ కంపెనీలు, విశ్వసనీయ సరఫరా గొలుసుపై ఆధారపడిన మరెన్నో సంస్థలు ఆగ్నేయాసియా దేశాలను ప్రత్యామ్నాయాలుగా ఎంచుకున్నాయి. వుహాన్ కేంద్రస్థలిగా కరోనా కేసులు ముమ్మరించిన తరుణంలో వెయ్యికిపైగా సంస్థలు భారత ప్రభుత్వంతో సంప్రతింపులు ఆరంభించాయన్న కథనాలు వెలుగుచూశాయి. చైనా ఊసెత్తితేనే నిప్పులు కక్కుతూ, అక్కడికి ఎగుమతులపై కొత్తగా ఆంక్షలు విధించిన అమెరికా- బీజింగ్‌ను ఇరకాటంలోకి నెట్టడమే ప్రధాన అజెండాగా పావులు కదుపుతోంది. చైనా భూభాగంనుంచి ఉత్పాదక విభాగాలను తరలించే సంస్థలకు చేయూతగా జపాన్ దాదాపు 25వేల కోట్ల యెన్‌ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. కొన్ని కొరియన్ సంస్థలు చైనానుంచి తట్టా బుట్టా సర్దేసి భారత్‌లో కార్యకలాపాలు సాగించడానికి ఉత్సుకత కనబరుస్తున్నాయి. ఈమధ్య చైనానుంచి తరలివెళ్ళిన 56 సంస్థల్లో వియత్నామ్‌కు 26, తైవాన్‌కు 11, థాయ్‌లాండ్‌కు ఎనిమిది చేరగా- భారత్‌కు దక్కింది కేవలం మూడేనని నొమురా అధ్యయనం నిగ్గుతేల్చింది. ఈ దశలో ఇండియాకు నికరంగా కలిసొచ్చేది ఎంతన్నదానిపై మూడీస్ సంస్థ నివేదికాంశాలు, ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమేమిటో సూటిగా చాటుతున్నాయి.

తయారీ రంగాన ఎదురన్నదే లేని మహాశక్తిగా వెలుగొందిన చైనాది ఇక గత ప్రాభవమేనంటున్న మూడీస్ అధ్యయనం- మారిన స్థితిగతుల్లో తూర్పు, ఆగ్నేయ ఆసియా దేశాలు సమధికంగా లాభపడనున్నాయంటోంది. సువర్ణావకాశం అందిపుచ్చుకోకుండా భారత్‌ను దిగలాగుతున్న అంశాల్నీ అది క్రోడీకరించింది. పోటీదారులతో పోలిస్తే దేశీయంగా అధిక ఉత్పత్తి వ్యయం వెలుపలి పెట్టుబడిదారుల్ని కుంగదీసేదే. మూలధన పెట్టుబడులు, విద్యుత్ సుంకాలు, పన్నుల మోత సైతం ఇక్కడ ఎక్కువేనని గణాంకాలు స్పష్టీకరిస్తున్నాయి. బ్యూరాక్రటిక్ అలసత్వం, అడుగడుగునా పనుల్లో అలవిమాలిన జాప్యం భారత ప్రగతికి ప్రతిబంధకాలవుతున్నట్లు నిపుణులు ఎన్నేళ్లుగానో మొత్తుకుంటున్నారు. ఆ లోటుపాట్లే ఇండియాకు ఇప్పటికీ గుదిబండలంటున్న హెచ్చరిక, ప్రభుత్వాలు ఇక ఎంతమాత్రం ఉపేక్షించరానిది! చైనాకు ఎదురుగాలి వీస్తున్న దృష్ట్యా ఎలెక్ట్రానిక్స్ తయారీ రంగంలో నిలదొక్కుకునేందుకు కృషి చేయాల్సిందిగా కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ రాష్ట్రాలకు పిలుపిచ్చారు. దేశం ఎలెక్ట్రానిక్ హబ్‌గా రూపాంతరం చెందాలంటే- మరిన్ని తయారీ సమూహాల(క్లస్టర్ల)కు అనుమతులివ్వాలని, సూక్ష్మ చిన్న మధ్యతరహా సంస్థలకు మినహాయింపులు ప్రసాదించాలన్న రాష్ట్రాల అభ్యర్థనలకు మన్నన దక్కాలి. దేశ ఉత్పాదక రంగానికి కొత్త సత్తువనిచ్చే కీలక విధాన నిర్ణయాల్ని చురుగ్గా అమలుపరచాలి. కుదేలైన ఆర్థిక రంగానికి నవోత్తేజం కలిగేలా భిన్న పరిశ్రమల్ని సరఫరా గొలుసులో అంతర్భాగం చేయడంతోపాటు- భూ, కార్మిక, పన్ను నియంత్రణ వ్యవస్థల్ని సాకల్యంగా ప్రక్షాళించాలి. మౌలిక వసతుల్ని పరిపుష్టీకరించాలి. ఆ మేరకు కార్యకుశలతే- చైనా నష్టాన్ని భారత్‌కు లబ్ధిగా స్థిరీకరించగలిగేది. అందులో సాధించే విజయమే, 2024నాటికి అయిదు లక్షల కోట్ల డాలర్ల భూరి వ్యవస్థగా అవతరించాలన్న లక్ష్య సాధనకు గట్టి పునాది అవుతుంది!

కందుకూరు పాత్రికేయులకు ఆదాల 2లక్షల విరాళం

(విన్యూస్, నెల్లూరు) : నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి తన నియోజకవర్గంలో భాగమైన కందుకూరులో పాత్రికేయులకు రెండు లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి ద్వారా కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి కి రెండు లక్షల రూపాయల నగదు మొత్తాన్ని అందజేశారు. కందుకూరులో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి అందజేసిన రెండు లక్షల రూపాయల విరాళాన్ని వారికి నిత్యావసర సరుకుల ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు ఎంపీకి తన ధన్యవాదాలు తెలిపారు. విజయ డైరీ చైర్మన్ రంగా రెడ్డి మాట్లాడుతూ ఈ లాక్ డౌన్ సమయంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే కందుకూరు పాత్రికేయ మిత్రుల సంక్షేమానికి రెండు లక్షల రూపాయల మొత్తాన్ని అందజేశారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు గుడ్లూరు ఈ ప్రాంతాన్ని కూడా సందర్శించినట్లు తెలిపారు .నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి లాక్ డౌన్ సహాయక చర్యల నిమిత్తం ఇటీవల తన సొంత నిధులు 20 లక్షల రూపాయలను జిల్లా కలెక్టర్ కు అందజేసిన విషయం తెలిసిందే.

వేద బ్రాహ్మణులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

(విన్యూస్, మచిలీపట్నం) : మచిలీపట్నం గాంధీ బొమ్మ శివాలయంలో

68మంది వేద బ్రాహ్మణులకు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

సొంత జిల్లాలకు చేరుకుంటున్న మత్స్యకారులు

(విన్యూస్, మచిలీపట్నం) : మచిలీపట్నం: ఆర్థికంగా వెనుకబడి, పేదరికంలో నెట్టబడి, పొట్టకూటికోసం, కుటుంబ పోషణకై జిల్లాలు, రాష్ట్రాలు దాటి మరీ వలస వెళ్ళిన వలస కూలీలు కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో కరోనా వైరస్ వ్యాప్తి నివారణకై దేశ వ్యాప్తంగా లాక్ డౌన్ ప్రకటించింది. కారణంగా ఇతర రాష్ట్రాల్లో చిక్కుకున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. తాజాగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వలస కూలీలు తమ తమ స్వస్థలకు వెళ్ళేందుకు నిర్ణయం తీసుకోగా గుజరాత్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్ళి అక్కడ చిక్కుకున్న మత్స్యకారు గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి , గుజరాత్ ప్రభుత్వంతో చర్చలు జరిపి వారిని అక్కడి నుండి మన రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కసరత్తు ప్రారంభించారు. అనంతరం గుజరాత్ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర నుండి చిక్కుకున్న దాదాపు 4500 మంది 58 బస్సుల ద్వారా గరికపాడు చెక్‌పోస్ట్ రహదారిగుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశించి ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా యస్పీ రవీంద్రనాథ్ బబు, ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను, జిల్లా డిఆర్‌డిఏ అధికారి శ్రీనివాసరావు, ఇతర ప్రభుత్వ యంత్రాంగం వారు జిల్లాలోకి ప్రవేశించిన వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యస్పీ మాట్లాడుతూ మీస్వస్థలం అయన ఆంధ్రప్రదేశ్ మీఅందరికీ స్వాగతం అని, గుజరాత్ రాష్ట్రంనుండి ఎన్నో వ్యేయ ప్రయాసలుకోర్చి, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, బ్రతుకు ప్రయాణంలో ఎదురీది, అలసిన మీఅందరికీ ఇక్కడకు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేసిందని, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మత్స్యకార మంత్రి గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రితో, ప్రధాన మంత్రి తో, కేంద్ర మంత్రితో సంబాషణలు జరిపి మీ అందరినీ ఇలా తీసుకురావడం జరిగిందని, దానికై మనమంతా ఎంతో కృతజ్ఞులమని, తెలుపుతూ పనుల నిమిత్తం అక్కడకు వెళ్ళి కరోనా వైరస్ నివారణలో భాగంగా అవలంభిస్తున్న లాక్ డౌన్ వలన ఆరాష్ట్రాలోనే చిక్కుకు పోయారు. అక్కడ మీరంతా ఎదుర్కొంటున్న సమస్యలను విని, చలించిన ముఖ్యమంత్రి గారు షుమారు 4500 వందల మందికి పైగా వున్న మీఅందరినీ తీసుకురావడానికి ఎంతో ప్రయాస పడ్డారని, మిమ్మల్ని తీసుకురావడానికి ప్రత్యేక బస్సులను, ఎస్కార్టు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని, కనుక మీరెవ్వరూ దిగులు చెందకుండా మీ ప్రాంతాలకు సురక్షితంగా వెళ్ళవచ్చని తెలిపారు. ప్రస్తుతానికి మొదట విడతగా ఉదయం 12 బస్సుల్లో 887 మంది వచ్చారని, మొత్తం 58 బస్సుల్లో 4500 మంది వరకు రాష్ట్రంలోకి ప్రవేశిస్తారన్నారు. అదేవిధంగా కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఇతర జిల్లాలకు చెందిన వలస కూలీలు 2,726 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 7,722 మంది వుండగా వారిని వారి వారి స్వస్థలాలకు పంపేందుకు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టి ఇప్పటికే కొంత మందిని బస్సుల ద్వారా వారిని పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇతర శాఖల ప్రభుత్వ అధికారులు, నందిగామ డియస్పీ రమణ మూర్తి, స్పెషల్ బ్రాంచ్ సిఐ చంద్రశేఖర్, జగ్గయ్యపేట సిఐ నాగేంద్ర కుమార్, యస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మేడే సందర్భంగా వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వారికి చిరు సన్మానం

(విన్యూస్, మచిలీపట్నం) : కృష్ణ జిల్లా మచిలీపట్నంలో లక్ష్మీ టాకీస్ సెంటర్ మేడే సందర్భంగా వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వ్యక్తులను మచిలీపట్నం డివిజన్ ఫోటో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరోన వంటి విపత్కర పరిస్థితుల్లో నిత్యం ప్రజలకోసం కష్టపడుతున్న వారి స్ఫూర్తి కి చిరు సన్మానం చేస్తున్న బందరు ఆర్డీవో ఖాజావలి, మచిలీపట్నం సీనియర్ న్యాయవాదిలంకిశెట్టి బాలాజీ, మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ శివరామ కృష్ణ, అధ్యక్షుడు పాల్గొన్నారు. పోలీసుశాఖ తరపున రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ మహమ్మద్ ఖాన్‌కి వైద్యరంగం తరపున డాక్టర్ పంచ పర్వాల కృష్ణకి పాత్రికేయ రంగం తరపున సీనియర్ జర్నలిస్టు ముదిగొండ శాస్త్రికి పారిశుద్ధ్య కార్మికుల తరపునకి ఎర్రం శెట్టి ఈశ్వర రావుకి ఫోటోగ్రాఫర్లు కాళ్లు కడిగి శాలువాలు కప్పి పూలదండలతో కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల శ్రమను గుర్తించి గౌరవించడం మన భాధ్యత:MLC బచ్చుల అర్జునుడు

కార్మిక లోకానికి మేడే శుభాకాంక్షలు

(విన్యూస్, మచిలీపట్నం) : కరోనా విపత్కర పరిస్థితులలో కార్మికుల కష్టాల పై మానవతా దృక్పథంతో కార్మికులకు అండగా నిలవాలని తెలుగుదేశం పార్టీ కృష్ణ జిల్లా అధ్యక్షులు, MLC బచ్చుల అర్జునుడు అన్నారు. శుక్రవారం మేడే సందర్భంగా కార్మికుల అందరికి కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ తరుపున మేడే శుభాకాంక్షలు తెలియజేసి మచిలీపట్నం 45వ డివిజన్లోని బస్టాండ్ లోగల 50 మంది కార్మిక కుటుంబాలకు నిత్య అవసర సరుకులు, కూరగాయలు అర్జునుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో %మీజ% అర్జునుడు మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో కార్మికుల కష్టాల పై సానుభూతి తో స్పందించి కార్మిక కుటుంబాలకు ఎటువంటి కష్టాల్లో అయిన మాజి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ఎల్లపుడు కార్మికులకు అండగా ఉంటుంది అన్నారు. కార్మికుల శ్రమను గుర్తించి గౌరవించడం మన అందరి భాద్యత అన్నారు. గత కొంతకాలంగా పలు రంగాలలోని కార్మికులు పనులు లేక ఎన్నో ఇబందులు పడుతున్నారని ఇప్పుడు మరి ముఖ్యంగా కరోనా మూలంగా కార్మికులు చాలా ఇబందులు పడుతున్నారని ఈ కష్ట కాలంలో వారి కష్టాలపై మనమంతా సానుభూతితో స్పందించాలని అర్జునుడు కోరారు. కార్మికుల ఉపాధికి ప్రభుత్వం చట్టబద్ధమైన రక్షణ కలిగించాలని కోరారు. ఎంతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు ఈ సమయంలో ప్రభుత్వం పకడ్బంధీగా అమలు అయ్యాల చూడాలని అర్జునుడు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. అలాగే అసంఘటిత రంగాలలోని కార్మికుల అభివృద్ధి గురించి కూడా తగిన చర్యలు తీసుకోవాలని అర్జునుడు అన్నారు. 45వ డివిజన్ లోని బస్టాండ్ లోని కార్మికులకు మేడే సందర్భంగా అడగంగానే సహాయం అందించిన MLC అర్జునుడుకు 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి పి.వి.ఫణి కుమార్ దంపతులు అర్జునుడుగారికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డ్ మాజి కౌన్సెల్లార్ కొట్టే వెంకటరావు, 45వ డివిజన్ ప్రెసిడెంట్ జి.రవికుమార్, బచ్చుల బోసుబాబు పలువురు ఆర్టీసీ సిబ్బంది, పలు కార్మిక యూనియన్ నాయకులు,కార్మికులు, తద్దితరులు పాల్గొన్నారు.

నాలుగు కుక్కల దాడిలో చిన్నారి మృతి

(విన్యూస్.పిడుగురాళ్ల): మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో ఆరుబయటతెల్లవారుజామున ఆడుకుంటున్న మూడు సంవత్సరాల షేక్ సఫార (తండ్రి అల్లిసైదా)అనే చిన్నారి ఇంటిముందు ఆడుకుంటుండగా నాలుగు కుక్కలు దాడి చేశాయి ఈ దాడిలో ఆ చిన్నారి తీవ్రగాయాలతో సృహ కోల్పోయింది.హుటాహుటిన గ్రామంలో ఉన్న వైద్యుని దగ్గరకు తీసుకెళ్లగా మృతి చెందిందినట్లు వైద్యుడు చెప్పారు. ఈ సంఘటన పిన్నెల్లి లోని శుద్ధ బావి వద్ద వాటర్ ప్లాంట్ వేసకాల జరిగినది. పిన్నెల్లి గ్రామంలో వీధి కుక్కలు, పిచ్చి కుక్కలతో ఇబ్బంది పడుతున్నామని గతంలో అధికారులకు తెలియపరచిననూ పంచాయతీ వాళ్ళు కానీ మండల అధికారులు గాని పట్టించుకున్న దిలేదు కుక్కల తో పాటు కోతలతో కూడా ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్లు తెరిచి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు వేడుకున్నారు.

బ్రాహ్మణులకు బాసటగా జగన్ ప్రభుత్వం

(విన్యూస్, మచిలీపట్నం) : వినూత్న పథకాలతో మందుకు సాగుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బ్రాహ్మణులకు ఎంతో బాసటగా నిలుస్తూ. ఆర్థికంగా ఊహించినంత చేయూత నిస్తున్నారని వైస్సార్ సి పి బ్రాహ్మణ సంఘ నాయకులు నిమ్మగడ్డ సత్య ప్రకాష్ , బొర్రా రాజగోపాలాచార్యులు (రాజా) పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మంత్రి పేర్ని నాని కార్యాలయం వద్ద బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ కు సంబంధించిన ఒక కార్యక్రమం జరిగింది. 9 లక్షల రూపాయలు 18 గ్రూప్ సబ్యులకు మంజూరు కావడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ బంధు మచిలీపట్నం కో-ఆర్డినేటర్ చోడవరపు ప్రసన్న మాట్లాడుతూ ఒక్క గ్రూప్ కు 3 గురు సభ్యులు ఉంటారని, బకాయిలు తీర్చేసి మూడవ సారి రుణం పొంది న ముగ్గురు సభ్యులు 1 లక్ష రూపాయలు , రెండవసారి రుణం తీసుకున్న ముగ్గురు సభ్యులు 60 వేలు, తొలిసారిగా రుణం పొందుతున్న ముగ్గురు సభ్యులు 40 వేలు బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా అందుకోనున్నట్లు తెలిపారు. తమకు ఈ సహాయం మంత్రి పేర్ని నాని తోడ్పాటుతో జరిగిందని ఆమె కృతజ్ఞత వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వం పేద కుటుంబాల్లో ఉపనయనం (ఒడుగు) చేసుకోవడానికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని నిర్ణయం తీసుకోవడం ఎంతో గొప్ప చర్యని పేర్కొన్నారు. 7 నుండి 16 ఏళ్ల మధ్య వయసున్న వారు ఉపనయనం చేసుకుంటే సాయం అందజేస్తారు. ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో కె.పాండురంగాచార్యులు, తాండూరు పాండు , కరిమి మురళీ , రాజనాల ఫణింద్ర తదితరులు పాల్గొన్నారు.

"పబ్లిక్ అకౌంట్ కమిటీ" సభ్యుడు గా ఎమ్.పి బాలశౌరి

(విన్యూస్, మచిలీపట్నం) : 2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను "పబ్లిక్ అకౌంట్ కమిటీ" సభ్యుడిగా మచిలీపట్నం ఎంపీ బాలశౌరి నియమితులయ్యారు. ఈ మేరకు మచిలీపట్నం ఎంపి బాలశౌరిని పిఏసి సభ్యుడిగా నియమించినట్లు "పబ్లిక్ అకౌంట్ కమిటీ" విభాగం నుంచి లేఖ అందింది. అలాగే లోకసభ లో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి ని పిఏసి ఛైర్ పర్సన్ గా స్పీకరు ఓం బిర్లా నియమించారు.

యు.టి.ఎఫ్. పతాకావిష్కరణ

(విన్యూస్, మచిలీపట్నం) : మేడే సందర్భంగా మచిలీపట్నం యు.టి.ఎఫ్. జిల్లా కార్యాలయంలో రిటైర్డ్ పి.డి. సీనియర్ నాయకులు ఎం.అర్జునరావు ఆధ్వర్యంలో యు.టి.ఎఫ్. పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించ బడినది. రాష్ట్ర నాయకులు కె. ఎ. ఉమా మహేశ్వరరావు గారు యు.టి.ఎఫ్. పతాకాన్ని ఆవిష్కరించి నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జె.లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శి సి.హెచ్. రాజా శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అబ్దుల్ వహీద్, మచిలీపట్నం, పెడ న మండల శాఖల ప్రధాన కార్యదర్శులు జే. ప్రసాదరావు, టి.నాగేశ్వర రావు, కార్యకర్తలు కె.రంగనాథ్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా లోని యు.టి.ఎఫ్. నాయకులు కార్యకర్తలు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అందరికీ జిల్లా అధ్యక్షులు జె.లెనిన్ బాబు మేడే శుభాకాంక్షలు తెలిపారు.

చాగణం గ్రామ వాలంటీర్ ఎంపికపై ఫిర్యాదు

(విన్యూస్, సైదాపురం) : మండల పరిధిలోని చాగణం గ్రామంలో నియమించిన గ్రామ వాలంటీర్ ఎంపిక సక్రమంగా జరగలేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బాధితురాలు సీనియర్ సూపర్నెంట్ శ్రీలతకు కు వినతి పత్రం అందజేశారు. బాధితురాలు వివరాల మేరకు చాగణం దళితవాడకు చెందిన స్రవంతి కుటుంబ కారణాల వల్ల గ్రామ వాలంటరీ పోస్ట్ కు రాజీనామా చేయడం జరిగింది. అప్పటి నుండి ఖాళీగా ఉన్న గ్రామ వాలంటరీ పోస్ట్ కు అదే వార్డు కు చెందిన ఇద్దరు మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే గ్రామ వాలంటరీ పోస్ట్ ను మెరిట్ ప్రకారం ఎంపిక చేయలేదని బట్టా నూతన అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్లో నాకు 90 మార్కులు వచ్చాయని, 60 మార్కులు వచ్చిన వారికి గ్రామ వాలంటరీ పోస్ట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం తమ కుటుంబం పనిచేస్తుందని తెలుగుదేశం పార్టీ ఏజెంట్ గా పనిచేసిన కుటుంబానికి వాలంటరీ పోస్ట్ ఇవ్వడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆమె కోరారు. లేకుంటే ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి తీసుకుపోదామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అంటున్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మర కుంట చిరంజీవి, బట్ట వెంకటేశ్వర్లు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడులో 'మే' డే సందర్భంగా జెండా ఆవిష్కరించిన కామ్రేడ్స్..

(విన్యూస్, మర్రిపాడు) : కార్మికులు పోరాటానికి నిలువెత్తు సాక్ష్యం అయినా మే డే సందర్భంగా మండలంలోని బస్టాండ్ సెంటర్లో సి ఐ టి యు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు మునగాల సూర్యనారాయణ పార్టీ శాఖ కార్యదర్శి రామ్ తుల్లా సీఐటీయూ ఆఫీసు నందు పార్టీ మండల కార్యదర్శి రత్తయ్య జెండాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మూల వెంకయ్య మాట్లాడుతూ కార్మికులు చేసే పనిని 8 గంటల నుంచి 12 గంటలకు మార్పు చేసి ఆ విధానాన్ని చాప కింద నీరులా వర్తింప చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం యోచన చేస్తోందని మసిపూసి మారేడు కాయలు అన్ని పరిస్థితి వచ్చిందని ఈ సందర్భంగా మూల వెంకయ్య తెలియజేశారు.

ఉద్యోగులసంఖ్యను తగ్గించుకోడానికి రకరకాల పథకాలు వేస్తున్న వ్యాపారసంస్థలు, సగం జీతమే ఇస్తామంటున్న మరికొన్ని సంస్థల తీరు వల్ల ఘోరమైన ఇబ్బందుల పాలవుతున్నది సగటు వేతన జీవులు. ఖాకీకట్టుకున్న కార్మికులున్నారు, గోచీ పెట్టుకున్న కార్మికులు న్నారు, టోపీవేసుకున్న కార్మికులున్నారు.తెల్ల కాలర్ కార్మికులూ ఉన్నారు. ఒకరిది శారీరక శ్రమ, ఇంకొకరిదిమేధో శ్రమ. అందరూ శ్రమ జీవులే. ఆదాయాల్లో వ్యత్యాసం ఉండవచ్చు,రంగాలు మారవచ్చు. దానికి కూలి అని పేరు బెట్టినా, వేతనం అని పేరుబెట్టినా బతకడానికి డబ్బు, చెయ్య దానికి పని ఉండాల్సిందే. ఈకరోనా ప్రభావంతో ఏర్పడ్డ లాక్ డౌన్ కు పోలం కార్మికులు, కలం కార్మికులు అందరూ బాధల మధ్య నలిగి పోతున్నారు.రేపటికోసంఇంకాభయపడుతున్నారు. 1920లో భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఏర్పడింది. అంటే, ఇప్పటికి వందేళ్లుపూర్తయ్యింది. అప్పటి నుండికార్మికవర్గంలో చైతన్యం ప్రారంభమైంది. 1923 నుండి మనం మే డే జరుపుకోవడం ప్రారంభించాం. మరో మూడేళ్లల్లో శతవసంతంసంపూర్ణమవుతుంది. ట్రేడ్ యూనియన్స్ ఏర్పడినా, దానికిసమాంతరంగా అసంఘటిత రంగం కూడా పెరుగుతూ వచ్చింది. అదేఅనేక రంగాలకు పాకుతూ వచ్చింది. ప్రైవేటైజేషన్, లిబర లైజేషన్,గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత రంగాల్లో కార్మిక చట్టాలుఅమలుకాలేకపోయాయి. శ్రమదోపిడీ సాగుతూనే ఉంది. కాంట్రాక్టుఉద్యోగాలు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు పెరుగుతున్నాయి.

జెండా ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ పిఆర్‌కె

(విన్యూస్, మాచర్ల) : కార్మికులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. మేడే సందర్భంగా తమ కార్యా లయం ముందుర జెండా ఆవిష్కరించి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాలలోని కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమా లను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కుర్రి సాయిమార్కోండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1000 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ

(విన్యూస్, కోడూరు) : 1000 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేసిన సిపిఎం పార్టీ కోడూరు మండల పరిధిలోని ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు, అగ్రవర్ణాల్లోని నిరుపేదలకు కోడూరు మండలం సిపిఎం పార్టీ తరఫున గత వారం రోజుల నుంచి 1000 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ

చేసినట్టు పార్టీ నాయకులు ఆవుల బసవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలా బత్తిన మోహన్ రావు చెక్క వెంకటేశ్వరరావు వేజెండ్ల శ్రీనివాసరావు తమ్మ రత్తయ్య మెండు వెంకటకృష్ణారావు రాజగోపాల్ రావు జడ్పిటిసి అభ్యర్థి రేపల్లె యోగ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

V స్మార్ట్ యాడ్స్

Insurance

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

LOANS

HOME LOANS BUSINESS LOANS... PLEASE CONTACT: 9399936609

వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్.. సంప్రదించండి 9848667347

LOANS

పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, అగ్రికల్చర్ లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్ అన్ని రకాలలోన్స్ 2 రోజుల్లో ఇప్పించబడును. వడ్డీ 50 పైసలు. 1 లక్ష నుంచి 50లక్షల వరకు ఇవ్వబడును. కావల్సిన వారు సంప్రదించండి: 7095129660

మస్కిటో డోర్స్&విండోస్

చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును. సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

తక్కువధరకే ప్రకటనలు

ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

LOANS

BUSINESS LOANS MORTIGAGE LOANS CONTACT : 9491624334

అమ్మబడును

మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి: సెల్: 7032931205 సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం

మేడే రోజున కార్మికులకు శుభ వార్త చెప్పండి - డాక్టరు యరమల

(విన్యూస్, మాచర్ల) : మేడే రోజున భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ 5 వేలు అందించే శుభవార్తను ప్రభుత్వం ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ డాక్టరు యరమల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. తన పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు లాక్ డౌన్ కంటే మరో క్లిష్టమైన సందర్భం రాదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు షుమారు రూ2వేలు కోట్లు ఉన్నాయన్నారు. సదరు నిధుల నుండి కార్మిక కటుంభాలకు నెలకు రూ 5 వేల చోప్పున అందజేయాలని డిమాండ్ చేశారు. కరోనా వైరస్ కట్టడి పరిస్థితులలో రేషన్ బియ్యం కోసం ప్రజలచే వేలిముద్రలు వేయించటం సరికాదన్నారు. దీని కన్నా వాలంటీర్లు చేత రేషన్ బియ్యం, కందిపప్పు కార్డుదారుల ఇళ్ళకు చేర్చటం ఉత్తమమైన నిర్ణయం అని సూచించారు. సమావేశంలో నాయకులు నట్టువ రాధక్రిష్ణా, జివి సత్యనారాయణ, కోమ్ము కోటేశ్వరరావు, షేక్ బాబు, నాగరాజు, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మేడే సందర్భంగా కార్మికులకు భోజన ఏర్పాట్లు

(విన్యూస్, మాచర్ల) : మేడే సందర్భంగా మాచర్ల పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు స్థానిక స్వామి వివేకానంద సేవా సమితి ఆద్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కమీషనర్ గిరికుమార్ చేతుల మీదగా భోజనం ప్యాకేట్స్ పంపిణి కార్యక్రమంను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చేపట్టారు. కరోనా కట్టడి కోసం పనిచేస్తున్న మున్సిపల్, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, రోగులకు, పోలీసులకు, రెవిన్యూ సిబ్బందికి విలేఖరులకు భోజన ప్యాకేట్స్‌ను వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి పంపిణి చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కూరగాయలు పంపిణీ

(విన్యూస్, కోడూరు) : సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కోడూరు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కూరగాయల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలవర్తి సుబ్రహ్మణ్యం, సిపిఎం పార్టీ నేతలు ఆవుల బసవయ్య, చక్క వెంకటేశ్వరరావు, వేజెండ్ల శ్రీనివాస రావు పాల్గొన్నారు.

350 మందికి చికెన్ బిర్యానీ, కూరగాయలు పంపిణీ

(విన్యూస్, పెడన రూరల్) : మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడే ని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు,వృద్ధులకు,వలస కూలీలకు 350 మందికి చికెన్ బిర్యానీ మరియు కూరగాయలు పంపిణీ చేశారు. కరోనా లాక్ డౌన్ మొదలయినప్పటి నుంచి యాచకులను,నిరుపేదలను,వలస కూలీలను అదుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్న మనం ఫౌండేషన్ శుక్రవారం మేడే ని పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులకు, పెడన క్యారంటైన్ సెంటర్లో ఉన్న వాళ్లకు,ఆర్టీసీ కార్మికులకు,వృద్ధులకు, యాచకులకు,వలస కార్మికులకు దాదాపు 350 మందికి చికెన్ బిర్యానీ పెడన,కట్లపల్లి, సింగరాయపాలెం, బ్రహ్మపురం, ముంజులూరు పరిసర ప్రాంతాల్లో పంచడం జరిగింది.అలాగే పెడన కి చెందిన %ణణ ఉ ూూచీూ% వెజిటబుల్ మర్చంట్ వారు అందించిన 500 కేజీల కూరగాయలకు తోడు మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో 100 కేజీల కూరగాయలు కొని మొత్తంగా 600 కేజీలను దాదాపు 350 కుటుంబాలకు 5 రకాల కూరగాయలను బ్రహ్మపురం, పెడన,కొంకేపూడి పరిసర ప్రాంతాల్లో పంచడం జరిగింది.ఈ సందర్భంగా మనం ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ కరోనా లాక్ డౌన్ మొదలయినప్పటి నుంచి ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదు అనే లక్ష్యంతో పని నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని రాబోయే రోజుల్లో ఎవరైతే ఇబ్బందుల్లో ఉండి ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ మామిళ్ల ఈశ్వర్ కుమార్,కార్యదర్శి మోతుకూరి వెంకటేష్,కోశాధికారి సింగరాజు సందీప్, మోతుకూరి నరేష్,మోతుకూరి పాండురాజు,మోతుకూరి నరేష్,మోదుగుమూడి వ్యాదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి బిస్కట్ ప్యాకెట్స్, జ్యూస్ ప్యాకెట్స్ పంపిణీ

(విన్యూస్, హనుమాన్ జంక్షన్) : కరోనా వ్యాధి నివారణ నిమిత్తం లాక్ డౌన్ డ్యూటీ లో ఉన్న హనుమాన్ జంక్షన్ సర్కిల్ సిబ్బందికి గోద్రెజ్ ఆక్వా ఫీడ్ కంపెనీ , కానుమోలు గ్రామం వారు తమ వంతు సహాయంగా జ్యూస్ ప్యాకెట్స్, బిస్కట్ ప్యాకెట్స్ ను నూజివీడు డి.ఎన్.పి, బి.శ్రీనివాసులు చేతుల మీదుగా హనుమాన్ జంక్షన్ సర్కిల్ సిబ్బందికి పంపిణీ చేశారు.

రజక సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు

(విన్యూస్, అవనిగడ్డ) : నియోజకవర్గ కేంద్రమైన అవనిగడ్డలో రజక సంఘం ఆధ్వర్యంలో మే డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ మాజీ ఎంపీటీసీ సభ్యులు అవనిగడ్డ ప్రకాశం ఆధ్వర్యంలో రజక సంఘం అధ్యక్షులు పులిగడ్డ వెంకటేశ్వరరావు కార్యదర్శి పాగోలు వెంకటేశ్వరావు కలిసి ఈ మే డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు రాజనాల మాణిక్యాలరావు మరియు మాజీ ఎంపీటీసీ సభ్యులు అన్నపరెడ్డి రామదాసు లు పాల్గొని మేడే జండాను ఎగరవేశారు. అనంతరం మిఠాయిలు పంచారు కరోనా వైరస్ కారణంగా లాక్‌డౌన్ అమలవుతున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా కేవలం అతి తక్కువ మంది తో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్మికులందరూ ఐకమత్యంగా ఉండి తమ పోరాటాల ద్వారా తమ హక్కులను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు వక్కలగడ్డ లంకమ్మ అవనిగడ్డ శ్రీనివాసరావ్ హనుమంతు కృష్ణ తలగడదీవి శంకర్రావు పులిగడ్డ గోపి తదితరులు పాల్గొన్నారు.

కరోనా విపత్తులో కార్మికులను ఆదుకోవటంలో ప్రభుత్వాలు విఫలం-బాలస్వామిరెడ్డి

(విన్యూస్, మాచర్ల) : కరోనా విపత్తులో ఆకలి కేకల మద్య ఉన్న కార్మికులను ఆదుకోవటంలో పాలక ప్రభుత్వాలు విఫలం అయినట్లు సిపిఐ ఏరియా కార్యదర్శి చవ్వా బాలస్వామిరెడ్డి వివరించారు. స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాలస్వామిరెడ్డి మాట్లాడుతూ కార్పోరేట్ శక్తులకు కోమ్ము కాస్తున్న పాలక ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమంను విస్మరించాయన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు నేడు అమలుకు నోచుకోవటం లేదన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నిరోదంకు ప్రభుత్వం లాక్‌డౌన ప్రకటించిందన్నారు. దీని వలన అసంఘిటిత రంగంలోని కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఇలాంటి పరిస్థితులలో కార్మికులకు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులతో ఆదుకోవటానికి ముందుకు రాకపోవటంలో పాలక ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గాజుల చెన్నయ్య, బత్తిన వెంకటేశ్వర్లు, టైలర్ జాని, భగత్‌సింగ్, మందా సునీల్, వేముల కోటేశ్వరరావు, లాజరస్, ఎస్ సైదా తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు మజ్జిగ, లస్సి, ప్యాకెట్స్ పంపిణీ

(విన్యూస్, కలిదిండి) : సంస్థ సభ్యులు దాత ఆర్థిక సహకారం తో లాక్ డౌన్ సందర్భంగా నిరంతరం సేవలు అందిస్తున్న పోలీస్, వైద్య సిబ్బందికి, వాలంటీర్లకు మజ్జిగ, లస్సి ప్యాకెట్స్, చక్కరకేళి పండ్లని అందజేశారు. ఈ కార్యక్రమం లో మానవత చైర్మన్ పెటేటి వివేకానంద, మారుబోయిన రత్నారావు, కట్టా వెంకట్రామయ్య, చిట్టూరి బాలకృష్ణ, పూర ప్రభు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో 100 కుటుంబాలకు అల్పాహారం పంపిణీ

(విన్యూస్, కోడూరు) : కోడూరు మండలం లో గత కొన్ని రోజులుగా కరోనా వైరస్ వలన ఇబ్బందిపడుతున్న పేద ప్రజలకు సిద్దినేని ఫౌండేషన్ మరియు జనసేన పార్టీ ఆధ్వర్యంలో 100 మంది పేద ప్రజలకు, అల్పాహారాన్ని కోడూరు మండలం జడ్పిటిసి అభ్యర్థి సిద్దినేని అశోక్ నాయుడు అందచేశారు. రాబోవు రోజుల్లో జనసేన పార్టీ పేద ప్రజలకు అండగా ఉంటావని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు రాము, సిద్దినేని శ్రీమన్నారాయణ, సిద్దినేని అనిల్ కుమార్ జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ భీమా చెక్కులు పంపిణీ

(విన్యూస్, నందిగామ) : ప్రమాదాల్లో మరణించిన వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా సౌకర్యం కల్పించడం జరిగిందని నందిగామ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. వీరులపాడు మండలం పలు గ్రామాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ బీమా సౌకర్యాన్ని కల్పించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం మేడే సందర్భంగా జుజ్జూరు గ్రామంలో మేడి పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యోగులు పోరాడి విజయం సాధించిన రోజును ప్రపంచవ్యాప్తంగా మేడే జరుపుకుంటున్నారు. ఈసందర్భంగా కార్మిక లోకానికి మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కోటేరు ముత్త రెడ్డి, ఆవుల రమేష్ బాబు, బొమ్మిశెట్టిభాస్కర్ రావు, వీరు లపాడు జడ్పిటిసి అభ్యర్థిని అమర్లపూడి కీర్తి సౌజన్య, కోటేరుసూర్యనారాయణ రెడ్డి, పసుపులేటి సాయిబాబు, పూల రాంబాబు, లింగం శెట్టి నవీన, ఏ పీ ఎం శ్రీనివాసరావు, షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

270 లీ బెల్లం ఊట పోలీసులు ధ్వంసం

(విన్యూస్, మచిలీపట్నం) : 270 లీ బెల్లం ఊటను బందరు రూరల్ పోలీసులు ధ్వంసం చేశారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు రురల్ సిఐ లక్ష్మి నరసింహ మూర్తి తన సిబ్బందితో పెద కరగ్రహారం మడ అడవుల్లో నాటు సారా నిల్వలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నాటు సారా తయారీకి వినియోగించే 270 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.

జర్నలిస్టులు నిస్వార్థ సేవకులు

(విన్యూస్, మైలవరం) : జర్నలిస్టులు నిస్వార్థ సేవకులని మదర్ థేరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ అన్నారు.శుక్రవారం కార్మికులు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రెస్ క్లబ్ లో లక్డౌన్ నేపథ్యంలో అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టులకు మాస్కులు,సానిటైజర్లు అందజేశారు.ఈ సందర్భంగా కోయ సుధ మాట్లాడుతూ జీతభత్యాలతో సంబంధం లేకుండా జర్నలిస్టులు కరోన మహమ్మారి విస్తరిస్తున్న,లక్డౌన్ అమలులో ఉన్నా కూడా పోలీసు,ఆరోగ్య సిబ్బందితో పాటు ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా విధులను నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తూ అటు ప్రభుత్వాన్ని,ప్రజలను అప్రమత్తం చేస్తూ సేవాలందిస్తున్నారన్నారు.వారి ఆరోగ్య రక్షణ కోసం తమ వంతుగా ట్రస్ట్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేసిన మాస్కులు,సానిటైజర్లు అందజేస్తున్నామని అన్నారు.అంతకు ముందు స్థానిక సిపిఎం కార్యాలయంలో 'మే'వేడుకల్లో పాల్గొని కార్మికులకు మాస్కులు,సానిటైజర్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నాగమణి,నీరజ,సిఐటియు మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కు మాస్కులు పంపిణీ

(విన్యూస్, పొన్నూరు) : కరోనా నుంచి రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సరఫరా చేసిన మాస్కులు, సానిటీజర్లు ను శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కీలారి వెంకట రోశయ్య పంపిణీ చేశారు. రెవిన్యూ, మున్సిపల్, పోలీసు అధికారులు సిబ్బంది ఈ సౌకర్యాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్. జి.రంగా జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాస్కులు కూడా ఎమ్మెల్యే పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ ఆపద సమయంలో ఆదుకునేందుకు ముందుకు వస్తున్న సంస్థలు, దాతలు ధన్య జీవులన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో డి.పద్మనాభుడు, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు,అర్బన్, రూరల్ సి ఐ లు ప్రేమయ్య, రత్నరాజు, పలువురు వైకాపా నాయకులు, రంగా ఆహ్వాన కమిటీ నాయకులు పాల్గొన్నారు.

20 లీటర్ల నాటుసారా పట్టివేత

నలుగురు వ్యక్తులు అరెస్టు రెండు స్కూటర్లు స్వాధీనం

(విన్యూస్, పులివెందుల) : మైలవరం మండలంలో శుక్రవారం 20 లీటర్ల నాటుసారా నలుగురు వ్యక్తులు రెండు స్కూటర్లుపట్టుకున్నట్టు జమ్మలమడుగు ఎక్సైజు సీఐచెన్నా రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే ...మైలవరం మండలం లోని చిన్న వెంతుర్ల గ్రామం చెందిన సుధాకర్ ఎర్రన్న లు అవుకు మండలం నుంచి పది లీటర్ల నాటుసారా ను తీసుకుని వస్తుండగా చిన్న వెంతుర్ల గ్రామం వద్ద సుధాకర్ ఎర్రన్న తో పాటు స్కూటర్ కూడా పట్టుకున్నారు. అలాగే పొద్దుటూరు కు చెందిన చిన్న శ్రీనివాసులు మౌలాలి ఆవుకునుంచి 10 లీటర్ల నాటుసారా తీసుకుని వస్తుండగా భీమ గుండం దగ్గర పట్టుకున్నట్లు జమ్మలమడుగు ఎక్సైజు సీఐచెన్నారెడ్డి తెలిపారు. వారి వద్ద నుండి ఒక స్కూటర్ ను కూడా స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసి వారి పైన కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.మండలంలో ఎవరైనా నాటుసారా విక్రయించిన రవాణా చేసిన తమకు తెలియజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరాలు చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ 19 లో దాతల సేవలు వెల కట్టలేనివి:వైయస్ మనోహర్ రెడ్డి

(విన్యూస్, పులివెందుల) : ప్రపంచ కార్మికుల దినోత్సవం (మేడే) సందర్భంగా... పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు.చిన్నప్ప సహకారం తో వైయస్ మనోహర్ రెడ్డి, వైయస్ మదన్ మోహన్ రెడ్డి, చిన్నప్ప ల చేతులమీదుగా శుక్రవారం 160 మంది మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు వారి ఆరోగ్య దృష్ట్యా శుభ్రత లో భాగంగా సబ్బులు, మాస్క్ లు పంపిణీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ..కోవిడ్ 19 విపత్తు లో లాక్ డౌన్ లో కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ఎనలేని సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికులకు, కూలి పనులు లేక జీవనానికి అవస్థలుపడుతున్న నిరుపేదలకు మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప చేస్తున్న సేవలు ఎనలేనివని ఈ సందర్భంగా ఆయన చిన్నప్ప ను అభినందించారు.

వైయస్ మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ... కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి కి తోడుగా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు అందరూ కలిసికట్టుగా కరోనా వైరస్ ను ప్రతిఒక్కరు కలిసికట్టుగా ఊడ్చి వేద్దాం అని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప మాట్లాడుతూ ..పారిశుధ్య కార్మికులకు ఏమి ఇచ్చినా వారి సేవల ముందు చాలా తక్కువ అని, వారికి అన్నివిధాలా తోడుగా ఉంటామని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమం లో రంగనాయకుల దేవస్థానం కమిటీ చైర్మన్ వెంకటసుబ్బయ్య, మాజీ కౌన్సిలర్ లు కోళ్ల భాస్కర్, శేఖర్ నాయుడు, గుడ్ల రమణ, శివకుమార్ రెడ్డి, రాష్ట్ర బి సి సంఘం నాయకులు అంబకపల్లి.నారాయణ స్వామి, వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, వైకాపా విద్యార్థి విభాగం నాయకులు రామలక్షణ్ రెడ్డి, నాని, యోహాన్, ప్రవీణ్, మహి, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ 19 విపత్తు లో రోగుల పాలిట రక్తదాతలే దేవుళ్ళు :రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్. చక్రపాణి

(విన్యూస్, పులివెందుల) : స్థానిక రక్తనిధిలో కోవిడ్ 19 విపత్తు కారణం గా రక్తం కొరత ఉన్నది... కానీ ప్రభుత్వ ఆదేశాల మేరకు రక్తదాన శిబిరాలు నిర్వహించకుండా, ఫేస్ బుక్ ద్వారా స్వచ్ఛంద రక్తదాతలు గుంపులు గా కాకుండా ఎవరికి వారు, వేరు వేరుగా రక్తనిధి వచ్చి స్వచ్ఛందంగా రక్తదాతలు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపు ఇవ్వగా... పట్టణం లోని . యువత విడి విడి గా... సామాజిక దూరం పాటిస్తూ, శానిటైజర్ తో చేతులు శుభ్రం చేసుకుని 35 మంది రక్తదానం చేయడం పట్ల రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్. చక్రపాణి మాట్లాడుతూ... కోవిడ్ 19 విపత్తు లో... ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అండగా నిలిచి రక్తదానం చేసేందుకు రావడం చాలా సంతోషము వక్కయము చేసారు . ఈ కార్యక్రమం లో సునీల్ రెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, వీర, మధుసూదన్ రెడ్డి, సంతోష్, దిలీప్ రెడ్డి, వాసు,వినోద్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

మాస్కులు అందించిన ఐఎన్‌టియుసి

(విన్యూస్, మాచర్ల) : కరోనా కట్టడి కోరకు విశేష కృషి చేస్తున్న ప్రభుత్వ సిబ్బందికి పంపిణి చేసేందుకు స్థానిక కెసిపి సంస్థలో పనిచేసే ఆర్‌కెసి ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు రూ 6 వేలు విలువ చేసే మాస్కులను మున్సిపల్ కమీషనర్ గిరికుమర్‌కు శుక్రవారం అందజేశారు. పట్టణంలో మున్సిపల్, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసు, రెవిన్యూ , గ్రామ సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు కరోనా కట్టడి కృషి చేస్తున్నారని, వీరికి రక్షణగా ఉండేందుకు మాస్కులను కమీషనర్ గిరికుమార్ ద్వారా అందజేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు యు ఏడుకొండులు, జిఎల్ నారాయణ, కె శ్రీనివాసరెడ్డి, టిహెచ్ బ్రహ్మయ్య, కేశవ, చాట్ల స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

చిన్న కాన్వెంట్‌లో పలువురికి కరోనా పరీక్షలు

(విన్యూస్, మాచర్ల) : మాచర్ల టౌన్, రూరల్‌లోని గుర్తించిన పలువురికి గుంటూరు నుండి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం చిన్నకాన్వెంట్‌లో శుక్రవారం కోవిడ్ పరీక్షలు నిర్వహించారు. వాలంటీర్లు ద్వారా గుర్తించబడిన పలువురిని జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు తీసుకువచ్చి ప్రత్యేక వైద్య బృందం కరోనా పరీక్షలు నిర్వహించారు. పట్టణంలో 7గురు, రూరల్ పరిధిలోని మరో 4గురికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిసింది.

అన్నార్తులను ఆదుకుంటున్న రెడ్ క్రాస్ సభ్యులు

(విన్యూస్, హనుమాన్‌జంక్షన్) : కరోనా లాక్ డౌన్ సందర్భంగా ఇబ్బందులు పడుతున్న వలస కూలీలకు, నిరుపేదలకు అన్నం అందించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తమ దానగుణాన్ని చాటుకున్నారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బాపులపాడు మండలం ఇంచార్జి బి.బాగ్యా రాజు, జి. విజయకుమార్, జి. రాజాబాబు,జి. శ్రీను,

ఎం.వేణుగోపాల్, టి. వినయ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 11 రోజులపాటు హనుమాన్ జంక్షన్ నుండి గన్నవరం వరకు రోడ్ ప్రక్క నిరుపేదలకు, యాచకులకు ప్రతిరోజు 500 మందికి ఆహారాన్ని అందిస్తున్నారు. వేలేరు హైస్కూల్ లోని కోరంటీన్ సెంటర్లోని వలస కూలీలకు, యాచకులకు అందించటంతో రెడ్ క్రాస్ సొసైటీ వారిని అధికారులు వీరిని అభినందించారు.

ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

(విన్యూస్, హనుమాన్‌జంక్షన్) : మే1 కార్మిక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు లహరి శంకర్ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం హనుమాన్ జంక్షన్ ఫోటోగ్రాఫర్స్ & వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో కోవిడ్ -19 కరోనా మహమ్మారిపై ఎదురునిలిచి మనకు విశేష సేవలందిస్తున్న

పారిశుద్ధ్య కార్మికులను శాలువాతో సన్మానించి పండ్లు అందజేయడం జరిగింది. పారిశుద్ధ్య కార్మికుల ను సన్మానించుకోవటం అదృష్టంగా భావిస్తున్నామని అసోసియేషన్ సెక్రటరీ తాడి రంగారావు ,కోశాధికారి గంటా శ్రీనివాస్ అన్నారు ఈ కార్యక్రమంలో సభ్యులు కళ్లెపల్లి నారాయణరావు,అంబళ్ల వెంకట రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం: ఆస్పత్రికి తరలింపు

(విన్యూస్, విజయవాడ) : తనకు ఇష్టం లేకుండా తండ్రి కుదిర్చిన వివాహాన్ని నిలువరించేందుకు ఓ యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన హనుమాన్ జంక్షన్ లో చోటుచేసుకుంది. హనుమాన్ జంక్షన్ ఎస్. ఐ అశోక్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం. మండల కేంద్రమైన బాపులపాడు గ్రామంలోని ఇందిరానగర్ కు చెందిన నాగేళ్ళ లావణ్య(20) శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్ కు ఊరి వేసుకుని ఆత్మహత్య కు పాల్పడింది. కొద్దిసేపటి అనంతరం ఇంటికి వచ్చిన ఆమె కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే ప్రయత్నాలు చేయగా అప్పటికే లావణ్య మృతి చెందింది. లావణ్య తండ్రి విజయ్ ఫిర్యాదు మేరకు జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు.మృత దేహాన్ని పోస్టుమార్టం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వాలు కార్మికులను ఆదుకోవాలి-సిఐటియు

(విన్యూస్, మాచర్ల) : కరోనా ప్రభావం వలన ఉపాధి కోల్పోయిన కార్మికులను పాలక ప్రభుత్వాలు వెంటనే ఆదుకునేందుకు చర్యలు ప్రకటించాలని సిఐటియు మాచర్ల డివిజన్ శాఖ డిమాండ్ చేసింది. మేడే సందర్భంగా పట్టణంలోని పలు కూడళ్ళలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. సిఐటియు కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన డివిజన్ నాయకులు ఎన్ లక్ష్మయ్య మాట్లాడుతూ కార్మిక సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని, అసంఘిటిత రంగ కార్మికులు, వివిధ

ప్రభుత్వ రంగ సంస్థలలో కాంట్రాక్ట్ కార్మికులు ఉపాది కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వాలు కార్పోరేట్‌ల సంక్షేమాన్ని గురించి ఆలోచించటం తగ్గించి ,కార్మికుల కోరకు తక్షణమే సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. మేడే సందర్భంగా పట్టణంలో ఎఐటియుసి,సిటియు, వైసిపి తదితర సంఘాల ఆద్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో బండ్ల మహేష్, వెంకటరత్నం, శోభన్‌కుమార్, సురేష్, వేముల వెంకటరావు, బత్తుల శ్రీను, బత్తుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద కార్మికులకు సరుకులు పంపిణీ

(విన్యూస్, పొన్నూరు) : మే డే సందర్భంగా శుక్రవారం స్థానిక నిడుబ్రోలు లో తాపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పేద కార్మికులకు బియ్యం, నూనెలు,కందిపప్పు, తదితర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏ ఐ టి యు సి పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కార్మిక సంక్షేమ బోర్డు నిధులు నుంచి రూ.5 వేలు చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లె బోయిన నాగరాజు, ఏ పి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కోటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్త మిత్ర సేవలు ఆదర్శ నియం :ఎమ్మెల్యే కిలారి

(విన్యూస్, పొన్నూరు) : కరోనా నివారణ లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన లాగ్ డౌన్ వల్ల పని కోల్పోయి కుదేలయిన కార్మిక కర్షక పేద బడుగు బలహీన వర్గాల వారికి లాయర్ గుమస్తాలకు జర్నలిస్టులకు ఆపదలో ఆదుకునే అనువైన నేస్తం ఆప్తమిత్ర సేవాసమితి యని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య ప్రశంసించారు. సమితి చైర్మన్ నన్నపనేని అంకినీడు చౌదరి ఆధ్వర్యంలో శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య చేతుల మీదుగా కార్మికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బాపట్ల రోడ్డు లో ఉచితంగా నిత్యావసర సరుకులు,కూరగాయలు,బియ్యం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ లాక్ డౌన్ సమయంలో ఎవ్వరు ఆకలితో ఇబ్బంది పడకూడదని నిరుపేదల నుంచి కార్మికులకు తన వంతు సాయం చేస్తున్న నన్నపనేని అంకినీడు చౌదరి పలువురికి ఆదర్శనీయుడని అన్నారు. ప్రస్తుత లాక్డౌన్ వంటి విపత్కర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి బియ్యం కందిపప్పు నూనె చింతపండు మొదలగు నిత్యావసర సరుకులు కూరగాయలు అందించటం ద్వారా నన్నపనేని అంకినీడు చౌదరి తన దాతృత్వాన్ని చాటుకున్నారని కిలారి పేర్కొన్నారు .సామాజిక దూరం పాటించటం ద్వారా కరోనా వైరస్ నుండి రక్షణ పొందాలని ఆయన కోరారు. పంపిణీ కార్యక్రమానికి ముందు మేడే జెండాను కిలారి ఆవిష్కరించారు .ఈ కార్యక్రమంలో కోటా శ్రీనివాస రావు ,వడ్రాణం ప్రసాద్ రావు ,షేక్ నాజర్ ,మల్లెల రాజు డాక్టర్ ఎన్. రూత్ రాణి,బొద్దులూరి రంగారావు ,తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ పెన్షన్ మంజూరు

(విన్యూస్, ఆగిరిపల్లి) : ఆగిరిపల్లి మండల పరిధిలోని ఈదులగూడెం గ్రామంలో డయాబెటిస్తో బాధపడుతున్న గ్రామానికి చెందిన సగుర్తి చిన్న నాగేశ్వరరావు కు వైయస్ జగన్మోహన్ రెడ్డి పభుత్వం ప్రవేశపెట్టిన డయాలసిస్ కింద పదివేల రూపాయల పెన్షన్ మంజూరు చేయడం జరిగింది.ఈ పదివేల రూపాయలుని ఈరోజు మాజీ సర్పంచ్ ఈలప్రోలు వెంకటసుబ్బయ్య, గ్రామ కార్యదర్శి బంగారు అంజలి, నండూరి భాస్కర్ ప్రసాద్ గ్రామ వాలంటీర్ సిహెచ్ అనూష లు నాగేశ్వరరావుకు పెన్షన్ అందజేయడం జరిగింది.

సి పి ఐ కార్యాలయం వద్ద మే డే వేడుకలు

(విన్యూస్, పొన్నూరు) : స్థానిక సి పి ఐ కార్యాలయం వద్ద శుక్రవారం మే డే వేడుకలు ఘనంగా జరిగాయి.ఏ ఐ టి యు సి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో ట్రాలీ ఆటో యూనియన్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్, ఇ.బి ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ ఐ టి యు సి పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు మాట్లాడుతూ లాక్ డౌన్ నేపథ్యంలో వలస కూలీలు,కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గోగినేని పరుసురామయ్య,జి.ఏడుకొండలు, జి.హెబ్జేజర్ బాబు, మిక్కిలి జాన్,శేషయ్య, నిమ్మకాయల వెంకటేశ్వర్లు,దావీదు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే దినోత్సవం

(విన్యూస్, పొన్నూరు) : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు శుక్రవారం పొన్నూరు పట్టణం లో ఘనంగా జరిగాయి. స్థానిక జి బి సి రోడ్డు లో పౌర హక్కుల సంఘ జిల్లా అధ్యక్షులు డాక్టర్ టీ రాజారావు మేడే జెండాను ఎగురవేశారు .ఈ సందర్భంగా డాక్టర్ రాజారావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శ్రామికుల కర్షకుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాట ఫలితమే ప్రస్తుతం శ్రమకు తగిన వేతనాలు శ్రామికులు పొందుతున్నారన్నారు.మే ఒకటో తేదీన మేడే పండుగ జరుపు కో వటంద్వారా శ్రామికుల ఐక్యత ను చాటుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు .అక్రమ నిర్బంధంలో ఉన్న ప్రజా సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో రామకృష్ణ , నక్క ల ప్రసాద్ ,వెంకటేశ్వరరావు ,ఎం సాంబశివరావు ,విజయ్ కుమార్ ,బి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279